

విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉన్నత చదువుల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ రామచంద్రరావు సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రా, మామిడివలస, సంఘంవలస, బుదమమువుట్టు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళికలు, డైరీ తప్పనిసరిగా నిర్వహించాలని, వర్క్ బుక్స్ ఎప్పటికప్పుడు దిద్ది తప్పులు ఉంటే సరి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు రాగి జావ వారానికి మూడు రోజులు విద్యార్థులకు అందించాలన్నారు.ఉపాధ్యాయులు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తూటంగి పంచాయతీ దాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వివిఎస్ అర్జున్ మరణించిన విషయం తెలుసుకొని ఆయన స్వగ్రామం మండిప్పుట్టులో కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఎంఇఓ రామచంద్రరావు హామీ ఇచ్చారు.

చిరు ధాన్యాల్లో మెండైన పోషకాలు

- వినియోగంపై మహిళా సంఘాలు అవగాహన కల్పించాలి-ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - పాడేరు: చిరు ధాన్యాల్లో మెండైన పోషక విలువలు ఉన్నాయని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రపంచ చిరు ధాన్యాల మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కాఫీ హౌస్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల వంటల ప్రదర్శనను జేసి, సబ్ కలెక్టర్‌తో కలిసి చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు రుచి చూసారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల స్వయం సహాయక బృందాలు చిరు ధాన్యాలతో తయారు చేసిన సుమారు 55 రకాల వంటకాలు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి పిఒ మాట్లాడుతూ, ప్రతి మండలంలో కనీసం వంద కొత్త సంఘాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హత గల సంఘ సభ్యులు రుణాలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తే కుటుంబం అంతటికీ ఆరోగ్యం లభిస్తుందని, దీంతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని వివరించారు. గిరిజన ప్రాంతాలలో సాంప్రదాయ పద్ధతిలో పండించే చిరు ధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నందున మహిళా సంఘాల ప్రతినిధులు ప్రతి సమావేశంలో చిరు ధాన్యాలు, ఆరోగ్యంపై చర్చించాలని కోరారు.జిల్లాలో రక్త హీనత, సికిల్‌సెల్ అనీమియా, తలసేమియా వంటి వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. చిరు ధాన్యాల వ్యాపారం కోసం విశాఖపట్నంలో స్థలం అడిగామని, 40 నుండి 50 ఆదివాసీ రైతు అవుట్ లెట్లు ఏర్పాటు చేసి చిరు ధాన్యాల రైతుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు మాట్లాడుతూ, రానున్న కాలంలో చిరుధాన్యాలకే అధిక ప్రాధాన్యమున్నదన్నారు. గిరిజనులు చిరు ధాన్యాల సాగును విస్తరించాలని సూచించారు. జిల్లాలో రక్త హీనత అధికంగా ఉన్నందున గ్రామ స్థాయి సమావేశాలలో ఆరోగ్యం, చిరు ధాన్యాల వాడకంపై విస్తృతంగా చర్చించాలని సూచించారు. ప్రభుత్వం కూడా ఐటీవల చిరుధాన్యమైన రాగి జావను పాఠశాల విద్యార్థులకు అందిస్తోందని, రేషన్ షాపులలో కూడా బియ్యం బదులు చిరు ధాన్యాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సబ్ కలెక్టర్ వి. అభిషేక్, జిల్లా వ్యవసాయాధికారి బిఎస్ఎన్ నంద్, డీఆర్డిఏ పిడి మురళి తదితరులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిడిఎం రవి తేజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్. దేవి, 22 మండలాల సమాఖ్య అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న పిఒ గోపాలకృష్ణ



నినాదాలు చేస్తున్న గంగరాజు, గిరిజనులు

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీ చెరుకుమెడత జంక్షన్ నుండి కంటిపురం మీదుగా భల్లుగుడ వరకురెండు కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి.గంగరాజు డిమాండ్ చేశారు. పెదబిడ్డ, గుమ్మ పంచాయతీల్లోని 38 గ్రామాలకు ఈ రహదారి ఉపయోగకరంగా వుంటుందన్నారు. అర్థాంతరంగా నిలిపి వేసిన రోడ్డు పనులు పునరుద్ధరించాలని స్థానిక ప్రజలతో కలిసి ఆయన శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుకిరువైపులా తవ్వి అర్ధాంతరంగా విడిచి పెట్టడంతో వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనాలు పడి పోతున్నాయన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సోమేల నాగులు, సొవేరి వెంకటరావు, జన్ని అప్పారావు, జన్ని. బుజ్జిబాబు, సొవేరి సుబ్బారావు, వంతల బుద్రయ్య, కోనేపు కొండలరావు, కోనేపు చిన్నరావు పాల్గొన్నారు.

ఇకెవైసి తప్పనిసరి

- జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు: రేషన్ కార్డు దారులందరికీ తప్పనిసరిగా ఇ-కేవైసి చేయాల్సిందేనని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివ ప్రసాద్ స్పష్టం చేసారు. శుక్రవారం పాడేరు మండలం సుండ్రుపుట్టు సచివాలయం-3 ను సందర్శించిన ఆయన వాలంటీర్లు, డిజిటల్ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ, దరఖాస్తులు పూర్తిగా పెండింగ్‌లో లేకుండా చూడాలని, సకాలంలో లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 70 సచివాలయాల ఫరిధిలో ఆదార్ అప్డేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, జిల్లాలోని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గంజాయి సాగు చేయడం విడిచిపెట్టి వాణిజ పంటల వైపు ప్రజలు, యువత మొగ్గు చూపాలని ఎస్సై రవీంద్ర సూచించారు. రంగబయలు పంచాయతీ పలు గ్రామాల్లో స్థానిక ఎస్సై కే.రవీంద్ర మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ పంటలు, రహదారి భద్రత, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్ఐ దృష్టికి ప్రజలు తీసుకొని వచ్చారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులకు మందులు, పిల్లలకు చాక్లెట్లు యువతకు వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కిట్లు ఇస్తున్న ఎస్ఐ

గుండాల ఇసుక ర్యాంపు అక్రమాలపై చర్యలేవీ ?

- అధికారులు ఎందుకు స్పందించడం లేదు

- సొసైటీలకు అప్పిగించి స్థానికులకు ఉపాధి కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక

1/70, పీసా చట్టాలను తుంగలో తొక్కి ఎటపాక మండలంలోని గుండాల ఇసుక ర్యాంపులో అక్రమంగా తవ్వకాలు చేస్తూ కోట్ల రూపాయలు వ్యాపారం చేసుకుంటుంటే అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని సీపీఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మనుషులతో లోడ్ చేయించి వారికి ఉపాధి కల్పించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా జెసిబిలతో నది నుండి ఇసుకను నేరుగా లారీలోకి లోడ్ చేసి రవాణా చేస్తున్నారని తెలిపారు. అయినా గుండాల ఇసుక క్వారీ యజమానులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చట్టబద్ధంగా ఇసుక రవాణాలో వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని పంచాయతీకి ఇవ్వాల్సి ఉండగా, ఇవ్వకుండా ఇసుక మాఫియా తన జేబులు నింపుకుంటుందని విమర్శించారు. వే బ్రిడ్జి లేకుండానే ఇసుకను నేరుగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని తెలిపారు. తప్పుడు వే బిల్‌తో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. పర్యావరణ, మైనింగ్, ఏజెన్సీ నిబంధనలు, చట్టాలు ఉల్లంఘిస్తున్నారని స్థానికులు, ప్రతిపక్ష పార్టీలు కొంతకాలంగా ఆందోళన చేపట్టినా, అధికారులకు విన్నవించినా ఐటీడీఏ అధికారులుగానీ, కలెక్టర్ గానీ స్పందించకపోవడం దారుణమన్నారు. చట్టాలను ఖూనీ చేస్తూ ఏజెన్సీలో ఖనిజం సంపద దోచుకెళ్తుంటే కాపాడాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారుల సహాయ సహకారాలు లేకుండా ఇసుక అక్రమ మైనింగ్ సాధ్యపడదని స్పష్టం చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోడానికి ఏ నిబంధనలు అడ్డు వస్తున్నాయో అధికారులు చెప్పాలన్నారు. కాసులతో చేతులు తడుపుకున్నారా, నోట్లతో నోర్లు మూతబడ్డాయా అని ప్రశ్నించారు. పేదోడు ట్రక్ ఇసుక తోలుకుంటే కేసులతో భయపెట్టే అధికార యంత్రాంగానికి గుండాల ఇసుక మాఫియా అక్రమాలు కనబడటం లేదా? అని సామాన్యులు ప్రశ్నించారని తెలిపారు. అక్రమార్కుల గుప్పెట్లో నుండి స్థానిక సొసైటీకు గుండాల ఇసుక ర్యాంపు అప్పగించి, స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అంత వరకు సిపిఎం పోరాడుతుందని బొప్పెన కిరణ్ స్పష్టం చేశారు.



రంపచోడవరంలో కురుస్తున్న వర్షం

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాయగా, సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశంలో నల్లమబ్బులు కమ్ముకొని సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో మండలంలో పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలు విరిగిపడి విద్యుత్తుకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే ఇప్పుడే కాపుకు వస్తున్న జీడి మామిడి గింజలు నేల రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయని మామిడి, జీడి, పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతపండుకు గిట్టుబాటు ధర

▶▶ దళారులను నమ్మి మోసపోవద్దు ▶▶ జిసిసి మేనేజర్ వెంకటేష్

ప్రజాశక్తి-అరకులోయ: ఏజెన్సీ ప్రాంతంలోని చింత పండు రైతులు దళారుల బారినపడి మోసపోవద్దని అరకులోయ జిసిసి మేనేజర్ బుక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, జిసిసి ఈ ఏడాది చింత పండును కిలో రూ.32.40 లకు కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. జిసిసిలో రైతులు విక్రయిస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని, మైదాన ప్రాంతాలకు చెందిన ప్రైవేటు దళారి వ్యాపారులకు విక్రయించి మోసపోద్దని ఆయన కోరారు. దళారులు బెట్టు కాటాల ద్వారా గిరిజన రైతులకు మోసాలు చేస్తున్నారని, ఇది గమనించి గిరిజన కార్పొరేషన్ సొసైటీకి విక్రయించి లాభాలు పొందాలని ఆయన కోరారు.ఈ ఏడాది అరకులోయ జిసిసి బ్రాంచ్ పరిధిలో 290 టన్నుల చింతపండును కొనుగోలు చేసినట్లు ఆయన అన్నారు.చింతపండు కొనుగోలు చేయడానికి తమ సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అరకు, కించమండ, లోతేరు, సుంకరమెట్ట వారపు సంతల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా చింత పండు ఉందని తమకు సమాచారం అందిస్తే ఇళ్ల వద్దకు కూడా తామే స్వయంగా వెళ్లి కొనుగోలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు. ఏప్రిల్ 30 వరకు కూడా చింతపండును జిసిసి సంస్థ కొనుగోలు చేస్తుందని ఆయన అన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు దళారి వ్యాపారులు చింతపండు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాఫీ కూడా ఈ ఏడాది కిలో రూ.285లకు కొనుగోలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 1300 టన్నుల కాఫీ కొనుగోలు అరకు బ్రాంచి జిసిసి లక్ష్యం కాగా, ఇప్పటివరకు తమ బ్రాంచి పరిధిలో వెయ్యి టన్నుల పార్చ్మెంట్ కాఫీ కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతోపాటు అటవీ ఉత్పత్తులైన సీకాయ, నల్లజీడి, కరక్కాయ, చోళులు, సామలు, కొర్రలు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో వారపు సంతల్లో కాటాలు ఏర్పాటు చేశామని దీన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న జిసిసి మేనేజర్ వెంకటేష్



నిరసన చేపడుతున్న కార్మికులు, సిఐటియు నేతలు

సమస్యలు పరిష్కరించాలని..

ఆసుపత్రి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఐటిడిఏ ముందు శుక్రవారం నిరసన చేపట్టి ప్రాజెక్ట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో పాడేరు, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆసుపత్రుల్లో గత 20 సంవత్సరాల నుండి పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.16 వేల వేతనం చెల్లిస్తున్నామని చెబుతున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు రూ. 10,700, సెక్యూరిటీ గార్డులకు రూ.8366 మాత్రమే కాంట్రాక్టర్లు చెల్లిస్తున్నారని చెప్పారు. పిఎఫ్, ఈఎస్ఐ కార్మికుల నుండి వసూలు చేస్తున్నప్పటికీ యజమాన్యం పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి వైద్య విధాన పరిషత్ ద్వారా జీతభత్యాలు చెల్లించాలన్నారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో 200 పడకలకుగాను వంద పడకల సిబ్బందితోనే పని చేయిస్తున్నారని, అరుకు ఏరియా ఆసుపత్రిలో 150 పడకలకు గాను 100 పడకల సిబ్బందితోనే పని చేస్తున్నారని దీంతో, పని భారం ఎక్కువై తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.ప్రతి నెల జీతాలు సక్రమంగా చెల్లించి, పరికరాలు, యూనిఫామ్ సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎల్ సుందర్రావు, ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘు, ముత్యాలమ్మ, కప, సుమిత్ర, పుణ్యవతి, శివ, రాజేశ్వరి, కొండమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయ పనులు నిలిపివేయాలి

ప్రజాశక్తి -పాడేరు: వైసిపి పార్టీ కార్యాలయం నిర్మాణ పనులు వెంటనే నిలుపుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు లింగెరి సుందరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం చింతల వీధిలో వైసిపి కార్యాలయం పనులు జరుగుతున్న స్థలం వద్ద గిరిజనులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు మండల కేంద్రంలో వైసిపి పార్టీ కార్యాలయం నిర్మాణ కోసం చింతల వీది పంచాయతీలో నడిమి వీది రెవెన్యూ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న 2 ఎకరాల భూమి కేటాయించారని తెలిపారు. ఆ భూమిలో తాత, ముతాతల నుండి సాగు చేస్తున్నారన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు హక్కు పత్రాల కోసం గతంలో దరఖాస్తు కూడా చేశారన్నారు. అయినా ప్రభుత్వం నిరంకుశంగా గిరిజన ప్రజల అభిప్రాయం తో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిం చడం సరికాదన్నారు. తక్షణమే నిర్మాణ పనులు నిలుపుదల చేయకపోతే ఉద్యమం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చినబాబు, మహేష్, సురేష్, సుమన్, పొల్లన్న, నాని, నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు, పునరావాసంపై

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాటకాలు ఆపాలి

సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్టు, పునరావాసంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న నాటకాలు ఆపాలని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక వైపు కేంద్రం 41.5 కాంటూరు వరకే నిర్మాణం జరుగుతుందని అంటుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 45 కాంటూరు వరకు నిర్మాణం చేస్తామని అనడం ముంపు ప్రాంత ప్రజలను అయోమయానికి గురి చేయడమే అవుతుందన్నారు. గతేడాది జులైలో వచ్చిన వరదల వల్ల ముంపు మండలాల ప్రజలందరూ నష్ట పోయారని, ఇదే సమస్య మళ్ళీ ఈ ఏడాది జులైలో పునరావృతమౌతుందని పేర్కొన్నారు. అందుకే ముంపు బారిన పడ్డ ప్రతి గ్రామాన్ని 41 కాంటూరులో కలపి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పొంతన లేని ప్రకటనలు చేయడం మాని, ముంపు ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, వెంకన్నబాబు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య

250 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ ధర్ ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏడుగురాళ్లపల్లి, పేగా, చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్య శిబిరానికి వచ్చారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పిల్లలకు ఆట వస్తువులు, క్యాలిమ్ బోర్డ్, చెస్, వాలీబాల్, ఫుట్బాల్ తదితర సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సెకండ్ హ్యాండ్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, సిఆర్పిఎఫ్ ఎస్ఎంఓ డాక్టర్ కల్పన, ఏడుగురాళ్లపల్లి పీహెచ్సీ డాక్టర్ ప్రసన్న, ఏడుగురాళ్లపల్లి సిఆర్పిఎఫ్‌డి 141 ఓసి పసుపులేటి కాశయ్య, చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్సై శ్రీనివాసరావు, సర్పంచులు సవలం సత్తిబాబు, చంద్రయ్య, సిఆర్పిఎఫ్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని తాటిమానుపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు కొయ్యూరు పోలీసులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఈ గ్రామంలో నాలుగు ఇళ్లు కాలిపోవడంతో ఆయా కుటుంబీకులు నిరాశ్రయులైన విషయం తెలుసుకున్న పోలీసులు సిఐ ఎ.స్వామినాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు ఎస్సై రాజారావు, మంప ఎస్సై లోకేష్ కుమార్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం గ్రామాన్ని సందర్శించి, అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తరపున రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. పోలీసుల సాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

గ్రామ పంచాయతీ కార్యాలయము, సీలేరు

రేఖా నెం. 07/2023 **టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన** **తేదీ.23-03-2023**

అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె.వీధి మండలం, సీలేరు గ్రామపంచాయితీకి చెందిన ఆదివారం వారపు సంత 2023-24 ఆర్థిక సంవత్సరమునకు అనగా తే:01-04-2023ది నుండి తే: 31-03-2024ది వరకూ బహిరంగ వేలం నిర్వహణ మరియు టెండర్ల స్వీకరణ ఈ దిగువ 1,2 షెడ్యూళ్ళు నందు వివరించబడిన వివరములు ప్రకారము జరుపబడును. షెడ్యూల్ 1 నందలి వివరములు ప్రకారం సప్లయినకు ధరావత్తులు చెల్లించి టెండరు దాఖలు చేయుటకు టెండర్లు తే: 28-03-2023ది మంగళవారం ఉదయం గం. 11.00లు నుండి మధ్యాహ్నం గం. 1.00 వరకూ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం గం. 2.00లుకు హాజరై టెండరుదారుల సమక్షమున తెరువబడును. షెడ్యూలు 2 నందలి వివరము గల బహిరంగ వేలము తే: 28-03-2023ది మంగళవారం మధ్యాహ్నం గం.3.00లు నుండి ఈ దిగువ సంతకముదారునిచే జి.కె.వీధి మండలం, శ్రీ విస్తరణాధికారి (పి.ఆర్ అండ్ ఆర్.డి.) వారి సమక్షమున నిర్వహించబడును. బహిరంగ వేలము పాటలో పాల్గొనువారు షెడ్యూలు 2 నందు చూపబడిన ఆదివారం వారపు సంతనకు ధరావత్తులు చెల్లించి సాల్వెన్సీ ధృవపత్రము దాఖలుపర్చవలెను.

షెడ్యూలు-1 తే: 28-03-2023ది ఉదయం గం. 11.00 నుండి మధ్యాహ్నం గం. 1.00 వరకు

వ. నెం.	సప్లయి వివరములు 2023-2024 (తే:01-04-2023ది నుండి తే: 31-03-2024ది వరకు) సం.నకు	ధరావత్తు రూ.లలో
1.	సీలేరు గ్రామపంచాయితీ ఏరియాలో ప్రజారోగ్య పారిశుధ్య పనులకూ గానూ నిర్వహణకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషి 1కి నెల 1కిరేటు	1,000/-
2.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల మంచినీటి స్కీములు మరియు వీధి కుళాయి పనులు నిర్వహణకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషి1కి నెల1కి రేటు	500/-
3.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల విద్యుత్ వీధి లైట్లు నిర్వహణ పనులకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషికి 1కి నెల 1కి రేటు	500/-
4.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో ప్రజారోగ్య పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమగు మందులు, బ్లీచింగ్ పౌడర్, పొడిసున్నం, ఫినాయిల్ వగైరాలను మరియు నిర్వహణ సామాగ్రి సరఫరా చేయుటకు	1000/-
5.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల మంచినీటి బోర్లు నిర్వహణకు గ్రామపంచాయితీకి అవసరమగు సామాగ్రి సరఫరా చేయుటకు	1000/-
6.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల మంచినీటి పైపులైను మరియు వీధి కుళాయిలు నిర్వహణకు అవసరమగు సామాగ్రి సరఫరా చేయుటకు	1000/-

షెడ్యూలు-2 తే: 28-03-2023ది మధ్యాహ్నం గం. 3.00లు నుండి

వ. నెం	బహిరంగ వేలం పాట వివరములు	ధరావతు రూ.లలో
1.	ఆదివారం సీలేరు వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకునే హక్కు (2023-2024 (తే:01-04-2023ది నుండి తే:31-03-2024ది వరకు సం.నకు	2000/-

షెడ్యూలు 2 నందు బహిరంగ వేలంపాటకు సాల్వెన్సీ ధృవపత్రము శ్రీ తహశీల్దార్ వారిచే తే: 01-01-2023ది తదుపరి జారీ చేయబడునది అయివుండవలెను.

నియమ, నిబంధనలు (1). షెడ్యూలు 1 నందు టెండర్లు, షెడ్యూలు 2 నందలి బహిరంగ వేలము సంబంధిత మిగిలిన షరతులు ఇతర వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను. టెండర్ల స్వీకరణ మరియు బహిరంగ వేలము వాయిదా వేయు అధికారము ఈక్రింది సంతకముదారునికి కలదు. టెండర్లు మరియు బహిరంగ వేలము గ్రామ పంచాయితీ వారి అనుమతి పొందిన తదుపరి ఖాయపర్చబడును. (2) షెడ్యూలు 2 నందు బహిరంగ వేలములో పాల్గొని, హెచ్చుపాటదారుడు పాట పాడిన పిదప ధరావత్తు మినహా పాట సొమ్ము మొత్తము గ్రామపంచాయితీ కార్యాలయములో చెల్లించి తగు రశీదు పొందిన తదుపరి మాత్రమే అశీలు వసూలు చేసుకొనవలెను. (3) షెడ్యూలు 1 నందలి గల 01 నుండి 03 వరకూ గల పనులకు సదరు పనులలో ప్రావీణ్యం గల వారిని మాత్రమే వినియోగించకొనగలవారమనియు సదరు పనులను పంచాయితీ కార్యదర్శి వారి పర్యవేక్షణలో పంచాయితీ కార్యదర్శి వారి సూచనల మేరకు నిర్వహించవలసి యుండునని మరియు అందుకు చెల్లించవలసిన లేబర్ పేమెంట్లును శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి.) పాడేరు వారి అనుమతులకు లోబడి గ్రామపంచాయితీ నగదు నిల్వలుననుసరించి సి.ఎఫ్.యం.ఎస్.బిల్లు ద్వారా ఆమోదిత కాంట్రాక్టర్లు యొక్క బ్యాంక్ అకౌంటు నందు జమ చేయబడును. (4) ప్రకృతి వైపరీత్యములకు గాని మరి ఏ ఇతర నష్టములకు గాని, గ్రామపంచాయితీ వారికి ఎటువంటి సంబంధము లేదు. పూర్తి బాధ్యత గుత్తేదారే వహించవలెను. (5) నిబంధనల మేరకు స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంటు వ్రాసి ఈ కార్యాలయమునకు సమర్పించవలెను.

సం/- వి.శ్రీనివాసరావు పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ - సీలేరు

స్పందన సమస్యల పరిష్కారంపై శ్రద్ధ

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న పిఒ గోపాలకృష్ణ, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: స్పందనలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ స్పష్టం చేసారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 47 అర్జీలను స్వీకరించారు. గిరిజన ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపించాలని అన్నారు. పెదబయలు మండలం బొంగరం పంచాయతీ పోతుల గరుపు గెడ్డ నుండి రాసకొండ బాల చెల్లమ్మ అమ్మవారి గుడి వరకు రోడ్డు నిర్మించాలని జామిగుడ ఎంపిటిసి జి.నిర్మల వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామానికి చెందిన పలాసి పిన్నయ్య సాగు భూములను సర్వే చేయించి పట్టాలు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ సావిడి మామిడి గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని గ్రామస్తులు కె.నాగరాజు, పి.నాగేశ్వరరావు దరఖాస్తును అందజేసారు. ముంచంగిపట్టు మండలం కుమడ పంచాయతీ బోనంగిపుట్టు గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని ముక్కి రమణ వినతి పత్రంలో కోరారు. పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ బొడ్డపుట్టు, సరియాపల్లి, వీసమామిడి గ్రామాలకు జి.మాడుగుల నుండి విద్యుత్తులైన్‌లు ఉన్నాయని వాటిని సోలములు గ్రామం మీదగా మార్చాలని గుల్లేల లింగమూర్తి కోరారు. పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ పనసపల్లి గ్రామం వద్ద నిర్మించిన చెక్ డ్యాం బిల్లు చెల్లించాలని గొల్లోరి నీలకంఠం అర్జీని అందజేసారు. ఎస్‌డిసి (టిడబ్ల్యూ) వివిఎస్ శర్మ, డిఎంహెచ్ఓ జామాల్ భాషా, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, డివిల్ పిఒ పిఎస్ కుమార్, ఆర్‌టిసి డిఎం ఆర్.ఎస్.నాయుడు, తహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో తనిఖీలు

పాడేరు టౌన్: స్థానిక ఎపిఆర్ జెసి సెంటరులో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసారు. అన్ని గదుల పర్యటించి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇన్విజిలేర్లను, డిపార్టుమెంటు అధికారులను చీఫ్ సూపరిండెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు తాహశీల్దార్ వి.త్రినాధరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

100 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సమీపంలో వంతాడపల్లి చెక్ పోస్ట్ వద్ద 100 కేజీల గంజాయిని, వీటిని రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎ.సంతోష్ శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఎపి 39 ఎఫ్ జి 3259 నెంబర్ గల కారుతో పాటు వెనకాల వస్తున్న రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ లో గంజాయి తరలిస్తుండగా చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని కొమ్మ సతీష్ కుమార్ (హుకుంపేట మండలం గూడ), ఎంపి జుల్ఫికర్ (పాడేరు) లుగా గుర్తించామని వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి 100 కేజీల గంజాయి, కారు, రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ ను స్వాధీనం చేసుకున్న మన్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు..

అవగాహనతో క్షయవ్యాధి దూరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు: ప్రస్తుత సమాజంలో ప్రాణాంతక అంటువ్యాధులలో ఒకటైన టిబి వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ కోరారు. స్థానిక అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు సాగిన టిబి అవగాహన ర్యాలీని శుక్రవారం శిక్షణ కలక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఐటిడిఎ సమావేశ మందిరమలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి గోపాల కృష్ణ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి సరైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం క్షయ వ్యాధి నుంచి స్వస్థత పొందిన రోగులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జే. శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జామాల్ భాషా, జిల్లా క్షయ నివారాణ అధికారి టి.విశ్వేశ్వరనాయుడు, జిల్లా ఆసుపత్రి వైద్యనిపుణులు సర్వేశ్వర్ పాల్గొన్నారు.

పాడేరు : చింతలవీధి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రపంచ క్షయ దినోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని పి.కుమ్మరిపుట్ ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు మాట్లాడుతూ, ఒక వ్యక్తి ద్వారా ఎక్కువ మందికి వ్యాపించే వ్యాధి ఒక్క క్షయ వ్యాధి అని తెలిపారు. రెండు వారాలకు పైబడి జలుబు, దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లక్షణాలు ఉన్నవారు వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు



సీలేరులో మానవహారం

పెదబయలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది క్షయ నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఒకరి నుంచి మరొకరికి దగ్గు, తుమ్ముల ద్వారా క్షయ క్రిములు ప్రబలుతాయన్నారు. లక్షణాలు ఉంటే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ వైద్య అధికారులు సిహెచ్ సిందూర పడాల్, వెంకటరావు, ఏం పిహెచ్ఓ పార్వతమ్మ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి వైద్య సిబ్బంది, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల చైర్పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, క్షయ వ్యాధి పట్ల ప్రజలందరూ అవగాహన ఉండాలన్నారు. ఎంపీడీవో కే.కిరణ్ కుమార్, డాక్టర్ మౌనిక, పి.శిరీష, వైద్యాధికారి శ్యామ్, టీబీ సూపర్వైజర్ సిహెచ్‌మూర్తి పాల్గొన్నారు.

చింతూరు : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులుర్యాలీ నిర్వహించారు. చింతూరు సర్పంచ్ కారం కన్నారావు పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి మెడికల్ కాలనీ మీదుగా సిపిఎం ఆఫీస్, చింతూరు మెయిన్ సెంటర్ మీదుగా డిప్యూటీ ఆఫీస్ వరకు కొనసాగింది. తులసిపాక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్, ఎస్‌టిఎస్ ఆర్ రామాంజనేయులు, ఎంపిహెచ్‌యు రాంప్రసాద్, డిపిఓ ఆఫీసర్ పి ధారయ్య. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి. లక్ష్మయ్య, పీహెచ్సీ తులసిపాక సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రంపచోడవరం : క్షయ వ్యాధిపై సరైన అవగాహనతో నిర్మూలన సాధ్యపడుతుందని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, డాక్టర్ లక్ష్మీ అన్నారు. శుక్రవారం ఉదయం రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆసుపత్రిలో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గంగా సురేష్, ముఖర్జీ, టీబీ సూపర్వైజర్స్ గీతాంజలి, వంశీ, సత్యవతి ,సత్తిబాబు పాల్గొన్నారు. రంపచోడవరం పీఎంఆర్‌సీలో శుక్రవారం ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ టీబీ డేలో ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పిటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, సంస్థ డైరెక్టర్ జి సుబ్బారాజు, ఎంపీటీసీ ఎస్కె ఖాజావలీ, ఏరియా ఆసుపత్రి కౌన్సిలర్ వాసు, డాక్టర్ రమేష్‌బాబు, సామాజికి శాస్త్రవేత్త ఎం సత్యనారాయణ, డైట్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ పి హరికృష్ణ, రాణి శిరీష ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మండల ప్రజా పరిషత్ విద్యార్థులు పోలీస్ స్టేషన్ కూడలి వరకు క్షయ వ్యాధి నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి 104 డాక్టర్ కృష్ణపవన్, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ కే ఆదిరెడ్డి, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ ఎంవి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మెయిన్ రోడ్డుకు చేరుకొని మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎస్‌కె.ఖాదర్ మస్తాన్, సౌమ్య, డ్వాక్రా సంఘ నాయకులు పార్వతి, దుర్గ, సిసి స్వాములు, సర్పంచ్ కే .వల్లి ప్రసాద్, హెచ్ఎస్ త్రినాథ్, హెల్త్ అసిస్టెంట్ ఉపేంద్ర, ఏఎన్ఎంలు బి.దేవి, కుమారి, అరుణ కుమారి పాల్గొన్నారు. సీలేరు మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డికె.హిమబిందు, డాక్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో ధారకొండలో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఎంపీహెచ్ ఓ పోతురాజు, పి హెచ్ ఎన్ రాణి, ఎం.ఎల్.హెచ్ పి. కుమారి, నాగమణి, హెచ్ ఏ గోవిందు పాల్గొన్నారు.

విఆర్.పురం : రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మానవహారం, ర్యాలీ నిర్వహించి క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సిహెచ్ ధనలక్ష్మి, రాయి గూడెం వైద్యాధికారి, సూపర్ వైజర్, ఏఎన్ఎంలు అలివేలు సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఏజెన్సీలో చాపకింద నీరుల రోజు రోజుకు ప్రబలుతున్న క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజవొమ్మంగి పీహెచ్సీ వైద్యాధికారి శ్రీదుర్గ అన్నారు. రాజవొమ్మంగి పిహెచ్సి పరిధిలో రాజవొమ్మంగి, సింగంపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో శ్రీదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి, సింగంపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు, పిహెచ్సి వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

విఆర్ఒ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: హుకుంపేట మండలంలో వీఆర్వోగా విధులు చేపడుతున్న శెట్టి ప్రవీణ్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్ శుక్రవారం డుంబ్రిగుడలో కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుడు శెట్టి ప్రవీణ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యాపరంగా ఉన్నత చదువులు అధిరోహించిన ప్రవీణ్ మృతి చెందడం బాధాకరమన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కే సురేంద్ర, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వి.త్రినాధరావు, కే.బాలాజీ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, డుంబ్రిగుడ వెళ్లి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న స్కూల్ ప్రిన్సిపల్ శంకర్‌రావు

ప్రజాశక్తి - పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా ఫేర్ వెల్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్ రావు మాట్లాడుతూ, టెన్త్ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. టెన్త్ అనంతరం పాలిటెక్నిక్, ఐటిలను కష్టించి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలలో వివిధ పోస్టుల భర్తీ కోసం కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ల్యాబ్స్‌లో జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు 200 ఖాళీలకు బీఎస్సీ/బీకాం/బిఎ అర్హత కలిగి 20 నుంచి 25 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.22,800 జీతం ఉంటుందని తెలిపారు. పొలగోని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ప్రాసెస్ అసిస్టెంట్ ఉద్యోగాలు సుమారు 30 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, డిప్లమో, పీజీ అర్హత కలిగి, 20 నుంచి 25 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు 12 వేలు జీతం ఉంటుందన్నారు. సీతమ్మధార స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్ సంస్థలో టెలికాలర్ ఉద్యోగాలు 20 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని, వీరికి రూ.12 వేలు జీతం ఉంటుందని తెలిపారు. అదే సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ 40 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత, 25 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందన్నారు.క్లోవ్ టెక్నాలజీ సంస్థలో ఆటో క్యాడ్, డెవలపర్స్ ఉద్యోగాలు 16 ఖాళీలకు బిటెక్ (సిఎస్ఇ), ఏదైనా డిప్లమో, బీటెక్ అర్హత కలిగిన 22 నుంచి 27 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.13,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ డేటా సోర్సింగ్ కమ్యూనికేషన్ ఉద్యోగాల కోసం డిగ్రీ సైన్స్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ కంప్యూటర్స్ కలిగిన అభ్యర్థులు అర్హులని, వీరికి విశాఖపట్నంలో 7, హైదరాబాదులో 15 ఖాళీలకు గాను 30 ఏళ్లలోపు వారు అర్హులని, వీరికి నెలకు వైజాగ్‌లో రూ.16 వేలు, హైదరాబాదులో రూ.18 వేలు జీతం ఉంటుందన్నారు. ట్రస్ట్ సర్వీసెస్ సంస్థలో 10 ఖాళీలకు ఐటిఐ పిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్ అర్హత కలిగి 18 నుంచి 48 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందన్నారు. సువర్ణభూమి సంస్థలో గ్రైండర్స్, హెల్పర్స్, మార్కెటింగ్ మేనేజర్, టీడీ కాలర్ తదితర 20 ఖాళీలకు 18 నుంచి 36 మధ్య వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.9000 నుంచి రూ.17,000 వేలు వరకు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, అర్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న జమాల్ ఖాన్

పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని నిమ్మలగూడెం గ్రామంలో ఉన్న ఆఫ్రిన్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ రంజాన్ ఉపవాస పండుగ సందర్భంగా శుక్రవారం మండలంలోని 200 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కింద 25 కిలోల బియ్యం, కేజీ పంచదార, కేజీ గోధుమపిండి, కేజీ సేమ్యాలు, పసుపు, ఉప్పు, కారం వంటి నిత్యావసర వస్తువులను అందజేశారు. భర్తలను కోల్పోయిన వితంతువులకు ప్రత్యేకంగా ఫిత్ర పేరుతో ధన సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఎస్కే సుబహాని తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి - విఆర్.పురం : 2021 ఆగస్టులో ఏజెన్సీలో చనిపోయిన ఐదుగురు ఆశ వర్కర్ల కుటుంబాలను ఆదుకోవాలని 66 రోజుల పాటు ఐటీడీఏ ఎదుట దీక్షలు చేసిన సందర్భంలో నాటి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ హరి కిరణ్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రంపచోడవరం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల డిమాండ్లపై హామీ ఇచ్చి ఏడాది దాటినా నేటికీ దాని అమలుకు చర్యలు తీసుకోకపోవడం దారుమణన్నారు. దీక్షల కాలంగా రెండు నెలల వేతనం ఆశా వర్కర్లకు బకాయి ఉందని, 12 మంది ఆశ వర్కర్లకు సిఎఫ్ఎంఎస్ పేరుతో మూడు సంవత్సరాల నుండి వేతనం ఇవ్వకుండా పిహెచ్‌సి అధికారులు వెట్టి చాకరి చేయించుకోవటం సిగ్గు చేటని విమర్శించారు. ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

'ఆల్ ది బెస్ట్ టు టెన్త్ స్టూడెంట్స్'కు శ్రీకారం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆల్ ది బెస్ట్ టు టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఇన్ రంపచోడవరం మండలం కార్యక్రమానికి ఎంపిపి బందం శ్రీదేవి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ముసురుమిల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి విద్యార్థులను కలిసి వారికి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి పండా కుమారి, ఎంపిటిసిలు వంశీ కుంజం, ముచ్చిక సాయిబాబు దొర, బచ్చల మంగమ్మ, ఎంపిడిఒ ఎంవిఆర్. కుమార్ బాబు, ఎంఇఒ కారం సత్యనారాయణదొర, స్థానిక వైఎస్సార్సీపి నాయకులు బొబ్బా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జివిఎంసి కార్మికుల ధర్నా


ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం గౌరవ అధ్యక్షులు జి.సుబ్బారావు, పి.వెంకటరెడ్డి మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల 482 పోస్టులు భర్తీ కోసం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఈ మహాధర్నా విజయవంతమైందన్నారు. కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు, సబ్బులు, కోకోనెట్ ఆయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు బజార్లలో అద్దె భారం

చెల్లించలేకపోతున్నామంటున్న రైతులు

రైతు భరోసా లబ్ధి కంటే అద్దె చెల్లింపునే ఎక్కువ

ఏడాదికి కోటికిపైగా పెంపు



గోపాలపట్నం రైతు బజారు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రైతు భరోసా కింద ప్రభుత్వం రూ.13,500 ఇచ్చినట్లే ఇచ్చి, అద్దె కింద ఏడాదికి రూ.36 వేలు వసూలు చేస్తోంది. ప్రభుత్వ సాయం కంటే అద్దె భారమే ఎక్కువ వుంది. గతంలో ఎన్నడూలేనంత అద్దె ప్రభుత్వం పెంచింది. వ్యాపారం తగ్గినా అద్దె చెల్లించక తప్పడంలేదు' - అని రైతు బజార్లలోని రైతులు వాపోతున్నారు. ఏడాదికి రూ.కోటికిపైగా పెంపు భారం వీరిపై పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని సబ్బవరం, కె.కోటపాడు, అనందపురం, పెందుర్తి, అరకులోయ, డుంబ్రిగుడ, పరవాడ, రావికమతం, దేవరాపల్లి, పాయకరావుపేట, కశింకోట, పద్మనాభం మండలాల్లోని పలు గ్రామాల నుంచి నగరంలోని రైతు బజార్లకు కూరగాయలు తెచ్చి రైతులు అమ్ముతున్నారు. వీరితో పాటు డ్వాక్రా సభ్యులు, హోల్‌సేల్, కమర్షియల్ వ్యాపారులకు కొన్ని స్టాల్స్ కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు నగరంలోని ఎంవిపి కాలనీ, సీతమ్మధార, మధురవాడ, పెదవాల్తేరు, నర్సింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ, ములగాడ, స్టీల్‌ప్లాంట్ రైతుబజార్లలోని కేటాయించిన స్టాల్స్‌లో కూరగాయలు అమ్ముతున్నారు. 1823 మంది రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినప్పటికీ వారికి తగ్గ స్టాల్స్ లేవు. పై 13 రైతు బజార్లలోని 1286 స్టాల్స్‌లో 226 కమర్షియల్, 197 ఫార్మర్ కమర్షియల్ స్టాల్స్‌కుపోనూ రైతులకు కేటాయించిన 881 స్టాల్స్‌లోనే 1823 మంది రైతులు సర్దుబాటు చేసుకొని కూరగాయాలు, ఆకుకూరలు విక్రయిస్తున్నారు.

తమ సొంత పొలంలో పండించిన కూరగాయలు తెచ్చుకొని అమ్ముకొనే రైతులకు ఉచితంగా స్టాల్స్ కేటాయించే పద్ధతి మొదటి నుంచీ కొనసాగుతోంది. పొలంలో పండించిన కూరగాయలతో పాటు ఒకటి, రెండు కూరగాయాలు తోటి రైతులు, లేదా మార్కెట్లో కొనుక్కొని రైతు బజార్లలో విక్రయించిన రైతుల నుంచి నెలకు మూడు వేల రూపాయల అద్దెను ప్రభుత్వం వసూలు చేస్తోంది. పొలంలో పండించుకొని రైతు బజార్లలో విక్రయించే పువ్వులు, అరటి, బొప్పాయి పంటలను వాణిజ్య పంట కింద గుర్తించి ఒక పూటకు గుర్తింపు కార్డున్న రైతు నుంచి రూ.3,600 చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 చెల్లిస్తుంటే, మా దగ్గర ఏడాదికి అద్దె రూపంలో రూ.43,200 వసూలు చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.1200 వున్న అద్దె, ఈ ప్రభుత్వంలో రూ.3,600కు పెరిగిందని వాపోతున్నారు. ఒకపూట కరివేపాకు అమ్ముకున్న మహిళల స్టాల్‌కు రూ.1200 నుంచి రూ.1800కు అద్దె పెంచారు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు విక్రయిస్తున్న డ్వాక్రా సభ్యుల స్టాల్‌కు రూ.9 వేలకు అద్దె పెంచారు.

గతంలో రైతు బజార్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదలచేసేది. ఈ ప్రభుత్వం నిర్వహణ ఖర్చుకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతు బజార్లలో స్టాల్‌ను బట్టి, ఆ ప్రాంతంలోని డిమాండ్‌ను బట్టి అద్దె నిర్ణయించి వసూలు చేస్తున్నారు. దీంతో 13 రైతు బజార్ల నుంచి 2022 జులై నాటికి నెలకు రూ.23,99,556 వసూలుకాగా, అద్దెలు పెంచడంతో ఆ ఆదాయం రూ.33,11,947కు పెరిగింది. నెలకు రైతు బజార్ల నుంచి అదనంగా రూ.9,12,391, ఏడాదికి కోటీ తొమ్మిది లక్షలా 48 వేలా 692 భారం మోపింది.

రైతు బజార్ల నిర్వహణ కోసమే అద్దెలు పెంచాం


రైతు బజార్ల నిర్వహణ కోసమే అద్దెలు పెంచాల్సి వచ్చింది. నామమాత్రపు అద్దెలు వసూలు చేస్తున్నాం. కమర్షియల్ స్టాల్స్ నుంచి, ఇతరుల నుంచి అద్దెలు వసూలు చేయడంలేదు.

షేక్ యాసిన్,
జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో ఎలా చేరుస్తారు ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సంఘం అధ్యక్షులు కటారి శోభన్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ తీర్మానాన్ని వేరొక ప్రకటనలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ కూడా ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యె మల్లయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తీర్మానానికి వ్యతిరేకంగా శనివారం ఉదయం 8 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అందరూ హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరు ప్రారంభోత్సవంలో సర్పంచ్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చెరుకుంపాలెం పంచాయితీ పాత వెలగల పాలెం గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందుల పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నాడు నేడు పథకంలో భాగంగా మంజూరు చేసిన తాగునీటి బోరు, మోటర్‌ను శుక్రవారం ఆ గ్రామ సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పిఎంసి కమిటీ సభ్యులు, పంచాయితీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఆసరాపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో వైయస్సార్ ఆసరా పథకంపై డ్వాక్రా మహిళలకు సిసి సోములు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పథకం ద్వారా సీలేరులో 35 డ్వాక్రా సంఘాలకు రూ.78,38,944 ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఒ ఎ.పార్వతి, బి.దుర్గ, సర్పంచి కె..వల్లి ప్రసాద్, సచివాలయం కన్వీనర్ స్వర్ణలత, వార్డు మెంబర్ రాము, వైసిపి కార్యకర్తలు బలరాం, బుజ్జి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మహిళల అభివృద్ధికి వైఎస్‌ఆర్ ఆసరా పథకం ఎంతగానో తోర్పడుతుందని ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యుడు వంశి కుంజం అన్నారు. మండలంలోని తామరపల్లి పంచాయతీలో వైఎస్‌ఆర్ ఆసరాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సున్న వడ్డీకే రుణాలు ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, వార్డ్ మెంబెర్ లక్ష్మి, గృహ సారధి బంధం లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ తురసం వీరయ్యమ్మ, విఎఎలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో విజయోత్సవం నిర్వహించిన టిడిపి నేతలు

టిడిపి విజయోత్సవం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ 3 స్థానాలను కైవశం చేసుకోవడం, ఎమ్మెల్యే కోటాలో టీడీపీ తరపున పంచుమర్తి అనురాధ గెలుపొందిన నేపథ్యంలో రాజవొమ్మంగిలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయోత్సవం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగాటిడిపి అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్రరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, పార్టీ నాయకులు ముప్పన కేశవ్, సావిత్రి, బుల్లమ్మ, లక్ష్మణరావు, సత్యనారాయణ, రామకృష్ణ, జి వెంకట్రావు చౌదరి, గుప్తా, జె మధు, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్సీలు గెలుపొందిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల శుక్రవారం రేఖపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, మండల కార్యదర్శి బురక కన్నారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనకు వ్యతిరేకంగా మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు ముత్యాల రాంబాబు, సవలం రాజేంద్రప్రసాద్, బొర్రా నరేష్, బీరక సూర్య ప్రకాష్ రావు, పాయం రామారావు, మహమ్మద్ రహీం, గోంది చంద్రయ్య, వాళ్ళ కోటేశ్వరరెడ్డి, బురక సారయ్య, ముత్యాల రమేష్, బొర్రా సూరి, ముర్ల మంగి రెడ్డి, తెల్లం అప్పారావు, శీలం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు

రామజోగిపేట మృతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలోని 29వ వార్డు రామజోగిపేటలో పురాతన భవనం కూలి ముగ్గురు మృతిచెంది, పలువురు గాయపడిన ఘటనపై 48 గంటలు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమంటూ బాధిత కుటుంబీకులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. మృతులకు నేటికీ ఎక్స్‌గ్రేషియో ప్రకటించకపోవడం శోచనీయమని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.